సాక్షి బాపట్ల
ఆదివారం । 30 । జూన్ । 2024



రూ.లక్ష విరాళం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి మచిలీపట్నానికి చెందిన భక్తుడు డాక్టర్ ఎల్.రాహుల్ రూ.1,00,116 విరాళం ఇచ్చారు.



ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాలలో శనివారం దేవాలయాల అర్చకుల కమిటీ సభ్యుల సహకారంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

తాలిబన్లను తలపించిన టీడీపీ నేతలు

భట్టిప్రోలు చరిత్రలో బ్లాక్‌డే

- వైఎస్సార్ విగ్రహ ధ్వంసం
- వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మౌన దీక్ష
- మద్దతు పలికిన దళితవాడ
- మౌనదీక్షను భగ్నం చేసిన పోలీసులు
- రేపల్లెకు అశోక్‌బాబు తరలింపు

అద్దేపల్లి(భట్టిప్రోలు): కక్షలు కార్పణ్యాలకు దూరంగా ఉండే భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని దహనం చేయడం గ్రామ చరిత్రలో బ్లాక్ డేగా నిలిచిందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. శనివారం రాత్రి ఆయన అద్దేపల్లి వచ్చి దహనం చేసిన విగ్రహాన్ని పరిశీలించారు. ధ్వంసం చేసిన 12 గంటలలోపే వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వేమూరు సీఐ పి. రామకృష్ణ, ఎస్‌ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విగ్రహం ఏర్పాటు చేసేంత సేపు ఆయన స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మౌన దీక్షకు దిగారు. కళ్లకు గంతలు కట్టుకుని పాల్గొన్నారు. దళితవాడలోని మహిళలు, వృద్ధులు, నాయకులు, కార్యకర్తలు అండగా ఆయనకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు.

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

విగ్రహం దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇటువంటి దుశ్చర్యకు ప్రేరేపించిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులతో కలసి అశోక్‌బాబు నినాదాలు చేశారు. టీడీపీ నాయకులు ఇటువంటి దారుణాలకు ఒడికడుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు ఇదా సమాధానం.. కాలానికి జ్ఞాపకశక్తి ఉంటుందని అన్నారు. కులాల మధ్య చిచ్చు రేపి వెనుక నుంచి నడిపిస్తున్నారని పేర్కొన్నారు. దళితవాడ వాసుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకే విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విగ్రహాలు, జనాలను తగలబెడితే ఊరుకునేది లేదని ఇందుకు వెనుకనుంచి నడిపిస్తున్న భట్టిప్రోలుకు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఇంటి ముందుకు వెళ్లి అడుగుదామని... ఇందుకు మీరంతా సిద్ధమేనా ? అని ప్రశ్నించారు. చంద్రబాబు చేస్తున్న రాక్షస పాలనకు ఇది ఒక పరాకాష్ట అని ధ్వజమెత్తారు. పట్టపగలే వైఎస్సార్ విగ్రహాన్ని టీడీపీ వర్గీయులు దహనం చేసి పైశాచిక ఆనందాన్ని పొందడం దుర్మార్గమని ఖండించారు. పేద వర్గాలను కులాల వారీగా విభజించి దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్యకు ప్రతి చర్య ఉంటుందని పేర్కొన్నారు. రాత్రి 7:30 గంటల నుంచి ఈ విగ్రహ ఏర్పాటు పనులు జరిగాయి. గ్రామస్తుల్ని ఉద్దేశించి అశోక్‌బాబు మాట్లాడుతూ టీడీపీ నాయకులు బలహీన వర్గాల వారిని జైళ్లకు పంపించాలంటే గ్రామాలు ఖాళీ చేయాలని.. చంద్రబాబు నాయుడు ఇది గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు.



కాల్చివేతకు ముందు వైఎస్సార్ విగ్రహం



టీడీపీ మూకలు కాల్చిన తర్వాత..

అశోక్‌బాబు దీక్షను భగ్నం చేసిన పోలీసులు

రాత్రి 8:30 గంటలకు అశోక్‌బాబు మౌన దీక్షకు దిగారు. 10 గంటల ప్రాంతంలో పోలీసులు భగ్నం చేసి అరెస్టు చేసి రేపల్లె తరలించారు. మహిళలు, చిన్నారులు అని చూడకుండా పోలీసులు నిర్దాక్షిణ్యంగా లాఠీచార్జి చేశారు. దళితవాడలో పోలీసులు మోహరించి విగ్రహం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కొత్త విగ్రహం వద్దకు ఎవరిని వెళ్లకుండా చూస్తున్నారు. ఏదైనా ఉంటే ఆదివారం చూసుకోమని చెబుతున్నారు. రేపల్లె పట్టణ పోలీసు స్టేషన్ ముందు కూడా అశోక్‌బాబు ఇంకా దీక్షను కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, కొల్లూరు మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, చుండూరు జెడ్పీటీసీ మాజీ సభ్యులు గాదె శివరామకృష్ణారెడ్డి, భట్టిప్రోలు, చుండూరు మండల కన్వీనర్లు మోర్ల శ్రీనివాసరావు, రఘురామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కొతరపు పద్మావతి, చుండూరు మాజీ ఎంపీపీ ఉయ్యూరు అప్పిరెడ్డి, బండారు శ్రీనివాసరావు, పడమట శ్రీనివాసరావు, కుందేటి రమేష్, తలకొల యలమంద, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, వేల్పూరి నాగేశ్వరరావు, విష్ణుమొలకల వెంకటరెడ్డియ్య, గోపాలం రాము, గాజుల చినభాను, జల్లి జోషికాంత్, సయ్యద్ సిరాజుద్దీన్, కరిసెట్టి బాలు, పప్పుల విజయరాజు పాల్గొన్నారు.



రేపల్లెలో పోలీసు వాహనంలోనే కళ్లకు గంతలు కట్టుకుని అశోక్‌బాబు దీక్ష



దగ్ధమైన విగ్రహాన్ని పరిశీలిస్తున్న అశోక్‌బాబు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ శ్రీనివాసరావు



భట్టిప్రోలు ఎస్‌ఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు అందచేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐతో మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున



గ్రామస్తులపై లాఠీ చార్జి చేస్తున్న పోలీసులు

కారం కోరుపై కమిటీతో విచారణ



సింథైట్ ఫ్యాక్టరీపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్



సింథైట్ ఫ్యాక్టరీని మూసివేయాలంటూ కలెక్టర్‌కు తెలిపేందుకు వచ్చిన మేదరమెట్ల గ్రామస్తులు

- ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్
- సింథైట్ కారం ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్గంధంపై ప్రజాభిప్రాయసేకరణ

మేదరమెట్ల: సింథైట్ కారం ఫ్యాక్టరీ నుంచి వెలువడే కోరు, దుర్గంధం నియంత్రణపై కమిటీ వేసి విచారణ చేపడతామని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్. శ్రీధర్ తెలిపారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామం తమ్మవరం రోడ్డు సమీపంలో ఉన్న సింథైట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్గంధంపై ప్రజాభిప్రాయసేకరణ, ఫిర్యాదుల కార్యక్రమాన్ని కొరిశపాడు మండల కార్యాలయంలో శనివారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఫ్యాక్టరీ నుంచి ప్రమాదకరమైన దుర్గంధాలు తరచూ వస్తున్నాయని, దీనివల్ల చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఫ్యాక్టరీని తక్షణమే మూసి వేయాలని కోరారు. మిరపకాయల తొడిమలను ఫ్యాక్టరీలో వినియోగించడం ద్వారా కోరు విపరీతంగా వస్తోందని, అది వెలువడే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గతంలో 60 టన్నులు ఉత్పత్తి జరిగేదని, ప్రస్తుతం 100 టన్నులకు పెంచారన్నారు. దీంతో 40 టన్నుల మిరప పిప్పి, కోరు బయటకు వస్తోందని చెన్నై ఐఐటీ బృందం గుర్తించిందని గ్రామస్తులు తెలిపారు.

చెరువు నీరు కలుషితం

వ్యర్థాల్ని బయటకు వదలడం వల్ల సమీపంలోని పొలాలు, చెరువులు కలుషితమవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. చెరువుల్లో నీళ్ల తాగిన పశువులు మృత్యువాత పడ్డాయని వాపోయారు. అన్ని అనుమతులతోనే తాము ఫ్యాక్టరీ నడుపుతున్నామని ప్రతినిధులు కలెక్టర్‌కు తెలిపారు. ప్రజలకు, పర్యావరణానికి ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. దీనిపై కమిటీని ఏర్పాటు చేసి గ్రామస్తుల సమక్షంలో పొల్యూషన్ బోర్డు అధికారులు విచారణ జరిపించేలా చూస్తామని తెలిపారు. సాంకేతిక నిపుణుల పరిశీలనతో వాస్తవాలను తెలుసుకుంటామని, ఫ్యాక్టరీ పనిచేసే సమయంలోనే సమగ్ర విచారణ జరుపుతామని చెప్పారు. విచారణ నివేదికను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు, ప్రభుత్వానికి అందజేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జి. సూర్యనారాయణరెడ్డి తహసీల్దార్ సుశీల, గ్రామస్తులు, ఫ్యాక్టరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్ సొమ్ము

మేదరమెట్ల: జూలై ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును సచివాలయాల ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి అందజేస్తారని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సమతవాణి మాట్లాడుతూ మండలంలో మొత్తం 7,425 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరందరికీ సచివాలయ ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా సొమ్మును అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పింఛనుదారులు ఇంటి దగ్గరే ఉండాలని, ఎవరూ బ్యాంకుల వద్దకు గానీ సచివాలయాల వద్దకు గానీ వెళ్లవద్దని ఆమె సూచించారు.

లోక్ అదాలత్‌లో 93 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: పెండింగ్ కేసుల్ని సత్వరమే పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. కేసుల్ని పరిష్కరించడంతో పాటు కక్షిదారులకు సత్వర న్యాయం చేసేందుకు ప్రతి నెలా లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ప్రతి ఒక్కరూ రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 93 కేసులు పరిష్కరించినట్లు వెల్లడించారు. ఇందులో 11 సివిల్, 76 క్రిమినల్, 6 ప్రీ లిటిగేషన్ కేసులున్నట్లు చెప్పారు. కక్షిదారులు రూ.25లక్షలు లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ, న్యాయవాదులు హరికుమార్, ఎం.కృపారామ్ పాల్గొన్నారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

మార్టూరు: భర్త వేధింపులు భరించలేక భార్య బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని నాగరాజుపల్లిలో శనివారం జరిగింది. సీఐ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన బోయినశెట్టి చిన్నవెంకటేశ్వర్లు తన మూడో కుమార్తె నందిని అలియాస్ నరసమ్మ (33)ను ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన జడ లక్ష్మీనారాయణతో 13 సంవత్సరాల కిందట వివాహం జరిపించారు. గత కొన్నేళ్లుగా నాగరాజుపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గత ఆరు నెలలుగా లక్ష్మీనారాయణ భార్య నందినిని నిత్యం అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో గత శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. నిత్యం భర్త అనుమానపు వేధింపులతో మనస్తాపానికి గురైన నందిని 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. అనంతరం విషయాన్ని తన అక్క వెంకటలక్ష్మికి ఫోన్ ద్వారా తెలపడంతో ఆమె స్థానికుల్ని అప్రమత్తం చేసింది. అపస్మారక స్థితిలో ఉన్న నందినిని శుక్రవారం మధ్యాహ్నం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం చిలకలూరిపేటకు తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా మారడంతో గుంటూరుకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నందిని పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి తండ్రి చిన్న వెంకటేశ్వర్లు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలకు కృషి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం గుంటూరు జీజీహెచ్‌లో ఆయన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, శాసనసభ్యులతో కలసి పర్యటించారు.

ప్రతి వారం ఒక శాఖపై సమీక్ష

కేంద్ర మంత్రి పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రతి వారం ఒక శాఖపై సమీక్షించనున్నట్లు చెప్పారు. ఆసుపత్రిలో ఏసీలు, లిఫ్టులు పనిచేయక పోవటం, రోగులు ల్యాబ్ టెస్టుల కోసం గంటల తరబడి వేచి ఉండటం, బయట ల్యాబ్‌లకు రిఫర్ చేయటం, పార్కింగ్, శానిటేషన్ సమస్యలు, రోగులకు డైట్, కొత్త బిల్డింగ్‌ల నిర్మాణ పనులు, అందులో కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రోగులకు సపోర్టింగ్ స్టాఫ్ తదితర సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని సమస్యలన్నింటినీ రెండు మూడు నెలల్లో పరిష్కరించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు.



జీజీహెచ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

ఆస్పత్రి అభివృద్ధికి కమిటీ : జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ నూతనంగా వచ్చిన శాసనసభ్యులతోను అధికారులతో ఆసుపత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన సమస్యలను సరిచేసి రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ఆసుపత్రిలో సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకొని వాటిని పరిష్కరించేందుకు, ముఖ్యంగా రోగులకు అందించే ఆహారం నుంచి అత్యవసర విభాగంలో వైద్యులు, వైద్యపరికరాలు తదితర అన్ని అంశాలపై చర్చించినట్లు తెలిపారు.
- పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఆదేశాల ప్రకారం సత్వరమే సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.
- ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఆసుపత్రికి రోజు రోజుకు రోగులు పెరుగుతుండటంతో వారికి అనుగుణంగా వైద్యులు, స్టాఫ్ నర్స్ లతో పాటు ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓ కొరత ఉందన్నారు.
- తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నాట్కో ట్రస్ట్, జింకానా ట్రస్ట్ ఇతర సేవా సంస్థలను కో-ఆర్డినేట్ చేసి వారిచ్చిన మౌలిక సౌకర్యాలను వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లపై గుంటూరు కలెక్టర్ సమీక్ష



నగరంపాలెం: జూలై ఒకటో తేదీన తాడేపల్లి మండలం పెనుమాకలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరవుతారని, అధికారులు అందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పర్యటన ఏర్పాట్లపై శనివారం రాత్రి కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్‌ఓ పెద్ది రోజా, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఉదయం ఆరు గంటలకు కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. అనంతరం జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో లబ్ధిదారులు, ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడతారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. పోలీస్ శాఖ బందోబస్త్ ఏర్పాట్లు, ఆర్‌అండ్‌బీ అధికారులు బారికేడ్స్ ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ఆర్‌డీఓ పి.శ్రీకర్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, సీపీఓ శేషశ్రీ, డీఈఓ శైలజ, డీఎస్‌ఓ కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలి



పెనమలూరు: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేయాలని కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా సూచించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ఏలూరు జిల్లాల ఉపాధ్యాయులకు నిర్వహించిన అటల్ టింకరింగ్ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో ఉపాధ్యాయులు సాంకేతికతపై అవగాహన కల్పించుకుని విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలని సూచించారు. బోధనలో సాంకేతికత అంశాలను జోడించి విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, డీఎస్‌ఓ జాకీర్‌అహ్మద్, స్టేట్ హబ్ ఇన్‌చార్జి డి.వి.సుబ్బారావు, హెచ్‌ఎం వై.దుర్గాభవాని పాల్గొన్నారు. అటల్ టింకరింగ్ శిక్షణ శనివారంతో ముగిసింది.

ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 24 లోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే అదేరోజు తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లోని నమోదు కేంద్రాల్లో తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. జూలై 27, 28 తేదీలలో ఉదయం 9గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు 93477 95839, 63045 72793 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దుర్గమ్మకు కళాకారుల నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బెంగళూరుకు చెందిన పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. వైష్ణవి నాట్యశాల ట్రస్ట్‌కు చెందిన పలువురు చిన్నారులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను కట్టి పడేసింది. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

క్లుప్తంగా

చినపరిమి సొసైటీ మాజీ చైర్మన్ వీర సాంబరెడ్డి మృతి

వేమూరు: మండలంలోని చినపరిమి గ్రామ వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు తమ్మా వీర సాంబరెడ్డి (70) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని మాజీ మంత్రి మేరుగ నాగార్జున సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం సాంబరెడ్డి నిరంతరం కృషి చేసినట్లు కొనియాడారు. కార్యక్రమంలో చందోలు డేవిడ్ విజయకుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, ఏ. శ్రీనివాసరెడ్డి, టి. బసవిరెడ్డి, టి.సాంబరెడ్డి, పి.అశోక్ కుమార్, పి. రాజేష్ కుమార్, శ్రీకాంత్, క్రాంత్ వంశి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దోపిడీ కేసుల్లో నిందితుల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: పలు దోపిడీలు, దొంగతనాల్లో ముగ్గురు నిందితులను చిలకలూరిపేట రూరల్ సర్కిల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈనెల 23వ తేదీన మండలంలోని లింగంగుంట్ల గ్రామ పరిధిలో కమ్మవారిపాలెం గ్రామానికి వెళ్లే తాగునీటి చెరువు వద్దకు పట్టణానికి చెందిన గట్టా జయసాయి పవన్‌రోహిత్, అతని మిత్రుడు సలీం వాకింగ్ నిమిత్తం వెళ్లారు. ఆయా కేసుల్లో నిందితులైన చిలకలూరిపేట సాంబశివనగర్‌కు చెందిన జూపూడి రాజేష్ అలియాస్ అశోక్, మదర్‌థెరిసా కాలనీకి చెందిన షేక్ అబ్దుల్‌బాషా, పాలడుగు నాగేశ్వరరావు అక్కడ మద్యం సేవిస్తున్నారు. ముగ్గురు యువకులు వీరిపై కర్రలు, ప్లాస్టిక్ పైపుతో దాడి చేసి వారి నుంచి సెల్‌ఫోన్లు లాక్కొని పరారయ్యారు. దీంతో కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు సీఐ పి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఎస్ఐలు జి.రవికృష్ణ, వి.బాలకృష్ణ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక సహాయంతో వీరిని చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.20వేల విలువైన సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చెడు వ్యసనాలకు బానిసై ఏపీలోని చిలకలూరిపేట రూరల్, అర్బన్, నాదెండ్ల, బల్లికురవ, తెలంగాణ రాష్ట్రం వాడపల్లి పరిధిలో పలు దోపిడీలు, దొంగతనాలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితులను త్వరితగతిన పట్టుకున్న రూరల్ సీఐ పి శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు జి.రవికృష్ణ, వి.బాలకృష్ణ, ఏఎస్ఐ డి.రోశిబాబు, హెడ్ కానిస్టేబుల్ శేషిరెడ్డి, కానిస్టేబుల్ ఇర్మియలను జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్ అభినందించారు.

నూరు శాతం గ్రాస్ శాలరీ ఇప్పించాలి

కేంద్ర సహాయమంత్రికి కాంట్రాక్టు నర్సుల సంఘం వినతి

గుంటూరు మెడికల్: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సింగ్ అధికారులకు జీఓలతో సంబంధం లేకుండా నూరు శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని కాంట్రాక్టు నర్సుల సంఘం నేతలు కోరారు. ఈమేరకు శనివారం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్టు నర్సింగ్ అధికారులను రెగ్యులర్ చేయాలని, మేనిఫెస్టోలో పేర్కొన్నవిధంగా కాంట్రాక్ట్ నర్సింగ్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ నర్సుల సంఘం నేతలు మనీషా, దివ్య తదితరులు ఉన్నారు.

టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన తెలుగుతేజం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరానికి చెందిన కొండా హేనాదీప్తి అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రముఖ సంస్థ అమెజాన్‌లో ఆరు లెవల్స్ స్థాయిలో కెనడాలోని టొరంటో నగరంలో పనిచేస్తున్న హేనాదీప్తి అమెజాన్‌లోనే కాకుండా ఆపిల్, గూగుల్‌తో పాటు ఆర్టీఎక్స్ అనే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్స్‌లో విశేష అనుభవం గడించారు. ఈ సందర్భంగా ఆమె టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు అమెజాన్ సీఈఓ సమాచారం పంపారు. గుంటూరు బ్రాడీపేట 6/12లో నివసిస్తున్న హేనాదీప్తి తండ్రి కొండా ఐన్‌స్టీన్ రాజ్ ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, ఆమె భర్త కళ్యాణ్ కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. కాగా టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డు ప్రదానోత్సవం అమెరికాలో మిచిగాంగ్ రాష్ట్రంలోని డెట్రాయిట్ నగరంలో అక్టోబర్ నాలుగో తేదీన జరగనుంది. హేనాదీప్తి గతంలో అరున్నరేళ్లు ఇన్ఫోసిస్‌లోనూ, రెండేళ్లపాటు ఐ.గేట్, మరో ఆరేళ్లు థామ్సన్ రీయూటర్స్‌లోనూ పని చేసి, గత ఏడేళ్లుగా అమెజాన్‌లో సీనియర్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా తమ పాఠశాల పూర్వ విద్యార్థిని హేనాదీప్తి అంతర్జాతీయస్థాయిలో అవార్డుకు ఎంపిక కావడంపై బ్రాడీపేటలోని లూథరన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కేఈ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. సాఫ్ట్‌వేర్ రంగంలో విశేష అనుభవం, నైపుణ్యం గడించిన హేనాదీప్తి గుంటూరు ఖ్యాతిని విదేశాల్లో చాటడం గర్వకారణమన్నారు.



కొండా హేనాదీప్తి

చిగుళ్ల వ్యాధిపై అవగాహన అవసరం

- ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియాడెంటాలజీ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఆశిష్ జైన్
- సిబార్ డెంటల్ కాలేజీలో చిగుళ్ల వ్యాధిపై జాతీయ సదస్సు

పెదకాకాని: చిగుళ్ల వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియాడెంటాలజీ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఆశిష్ జైన్ తెలిపారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో శనివారం చిగుళ్ల వ్యాధిపై జాతీయ సదస్సు జరిగింది. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఆశిష్ జైన్ మాట్లాడుతూ దంత వైద్యుల పర్యవేక్షణలో చిగుళ్ల వ్యాధులపై నిరంతరం పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. నోటి శుభ్రతతోనే చిగుళ్ల వ్యాధులను దూరం చేసుకోవచ్చని సూచించారు. క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ నోటి శుభ్రత పాటించాలన్నారు. ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ హెచ్.ఎస్. గ్రోవర్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో చిగుళ్ల వ్యాధులపై అనేక సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. వీటి వల్ల దంత వైద్యులకు, విద్యార్థులకు అవగాహన కలగటమే కాకుండా ప్రజల్లో కూడా చైతన్యం వస్తుందని తెలిపారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఇటువంటి సదస్సులు గతంలో ఎన్నో నిర్వహించామని, భవిష్యత్తులో కూడా మరిన్ని చేపడతామన్నారు. తమ కళాశాలలో విద్యార్థులను పూర్తిస్థాయిలో దంత వైద్యులుగా తయారు చేయడమే కాకుండా, అన్నివిధాల వారికి శిక్షణ ఇస్తామని తెలిపారు. సదస్సుకు రాష్ట్రంలోని 10 దంత వైద్య కళాశాల నుంచి పీజీ విద్యార్థులు హాజరయ్యారు. తొలుత కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ అనిల్ మేలత్, డాక్టర్ అర్పిత పాల్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ డి.రవీంద్రనాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బి.రామనారాయణ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.రమణారెడ్డి, వైస్ డీన్ డాక్టర్ బి.నగేష్, ఆర్గనైజింగ్ సభ్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఆశిష్ జైన్, డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్

పొలంలోని టేకు చెట్లు మాయం

ముప్పాళ్ల: పొలం గట్లపై పెంచుకుంటున్న టేకు చెట్లను నరికి మాయం చేసిన సంఘటన ముప్పాళ్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన చవాకుల వెంకటనాగ కోటేశ్వరరావు 25 సంవత్సరాల కిందట తన పొలం గట్ల మీద టేకు చెట్లు నాటి పెంచుకుంటున్నాడు. వీటిపైన కళ్లు పడిన దుండగులు రెండు రోజులపాటు రెక్కీ నిర్వహించారు. బలంగా ఉన్న పెద్ద చెట్లకు మార్కింగ్ వేసుకున్నారు. ఈనెల 26వ తేదీ రాత్రి సమయంలో చిరుజల్లులు పడుతుండటంతో వారి ప్లాన్‌ను అమలు జరిపారు. పది పెద్ద చెట్లను నరికి ముక్కలు చేసి ట్రాక్టర్ల ద్వారా రాత్రికి రాత్రే నరసరావుపేటలోని కోత మిషన్‌కు తరలించారు. రెండు రోజుల తర్వాత సమాచారం తెలుసుకున్న పొలం యజమాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రాథమిక విచారణలో నరసరావుపేటలోని ఓ కోత మిషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. దుంగలను రెండు మినీ లారీల ద్వారా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటి విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని యజమాని తెలిపారు. వెంకటనాగకోటేశ్వరరావు ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. హజరతయ్య తెలిపారు.



ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

నేడు సంగీత నృత్యోత్సవం

తెనాలి: ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలనుంచి ఆరంభించే ఈ వేడుకలో పలు నృత్యప్రదర్శనలు, సంకీర్తన గానం ఉంటాయని నిర్వాహకులు కొండపి శ్రీనివాసరావు తెలియజేశారు. సంగీత గురువు వరుముల సునీత, మృదంగ విద్వాంసుడు కేవీ రామకృష్ణతో కలిసి శనివారం సాయంత్రం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. నృత్య గురువులు పెసర్లంక వసంత దుర్గ, చల్లా యామిని శిష్యబృందం నృత్యాంశాలను ప్రదర్శిస్తారు. కొలిశెట్టి బాలా త్రిపుర సుందరి, చుండూరు ఆదిలక్ష్మి, సొల్లేటి శైలజ, మాదల గార్గి, కొండపి వసుంధర, కటకం అన్నపూర్ణ, ఎ.యశస్విని, గొరవరుల ఆంజనేయ శాస్త్రి, వరుల లక్ష్మీసునీత, ఆకెళ్ల హిమబిందు, పెరవలి వంశీకృష్ణ బృందాలతో సంకీర్తన గానం ఉంటాయన్నారు. గన్నె శ్రీనివాసన్‌చే వేణు గానం. చివరిగా లాలిపాట గానం ఉంటాయని తెలియజేశారు.



సీపెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అమరావతి: భారత ప్రభుత్వ విద్యాసంస్థ విజయవాడ సీపెట్‌లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చునని జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి కల్పనే లక్ష్యంగా మూడు సంవత్సరాల కాల వ్యవధితో కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థినీ, విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ వసతి కలదన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జులై 7వ తేదీ దరఖాస్తు చేసుకోవాలన్నారు ఈ కోర్సులను పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్స్ రంగంలో గల బహుళ జాతి సంస్థలు వాటి అనుబంధ సంస్థలలో, ఇంజినీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్-మేకర్, ఇంజినీర్ (మైంటెనెన్స్) వంటి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. డిప్లొమా పూర్తిచేసిన వారికి ప్రారంభ వేతన స్థాయి నెలకు రూ.16,000 నుంచి రూ.20,000 వరకు ఉంటుందన్నారు. ఈ కోర్సు చేయటం ద్వారా సాధారణ విద్యార్థులు కూడా మెరుగైన విజయాన్ని సాధించవచ్చన్నారు. దరఖాస్తు విధానం, ఇతర వివరాల కోసం 9398050255 నంబరులో సంప్రదించాలన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్



మంగళగిరి: మహిళల మెడల్లో వరుసగా బంగారు గొలుసులు లాక్కెళ్తున్న చైన్‌స్నాచర్‌ను అరెస్ట్ చేసిన అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ(క్రైం) శ్రీనివాసరావు తెలిపారు. పట్టణ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వ్యసనాలకు, జల్సాలకు అలవాటుపడిన విజయవాడకు చెందిన విఘ్నేష్ ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడల్లోని బంగారు చైన్‌లను లాక్కెళ్తుంటాడన్నారు. ఇటీవల మంగళగిరి, గుంటూరులలో ఇద్దరు మహిళల వద్ద చైన్‌లు తస్కరించగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితుడు శుక్రవారం నగర పరిధిలోని ఎన్ఆర్ఐ జంక్షన్ వద్ద ఉన్నాడనే పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 52 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రవికాంత్, సీసీఎస్ సీఐ వెంకన్న చౌదరి, పట్టణ సీఐ వినోద్ కుమార్, ఎస్ఐలు ఖాదర్ బాషా, క్రాంతి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

- గర్భం తీయించుకోవాలని ఒత్తిడి
- భర్త, మరో ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

కొల్లూరు : ప్రేమించి పెళ్లాడిన భార్యపై అనుమానంతో గర్భం తీయించుకుంటేనే కాపురం చేస్తానని పుట్టింటి వద్ద వదిలి వేధింపులకు పాల్పడుతున్న భర్త ఉదంతం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చిలుమూరు శివారు కొత్త చిలుమూరుకు చెందిన దూళిపూడి మహేష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికను మూడేళ్లగా ప్రేమిస్తున్నాడు. ఈ సమయంలో ఇద్దరూ సన్నిహితంగా మెలగడంతో నాలుగు నెలల కిందట యువతి గర్భం దాల్చింది. అప్పటికీ ఆమె మైనర్‌గా ఉండటంతో స్థానికంగా పెద్దమనుషుల మధ్య రెండు కుటుంబాలు చర్చలు జరిపారు. యువతి మేజర్ అయిన తర్వాత ఇద్దరికీ వివాహం జరిపారు. అయితే, అప్పట్నించి యువకుడు తండ్రి శ్రీనివాసరావు అతడ్ని రానివ్వకపోవడంతో అత్తగారి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 3న మహేష్ భార్యను పుట్టింటి దగ్గరే వదిలి తండ్రి వద్దకు వెళ్లిపోయాడు. అప్పట్నుంచి మహేష్‌తో పాటు, అతని తండ్రి శ్రీనివాసరావు, వరుసకు సోదరుడు, సోదరి అయ్యే రామాంజనేయులు, పద్మలు ఆ యువతిని వేధించడం ప్రారంభించారు. ఆమెపై అనుమానం వ్యక్తం చేశారు. గర్భం రావడానికి కారణమెవరో తమకేమి తెలుసునని, దాన్ని తీయించుకుంటేనే కాపురానికి తీసుకువెళతామంటూ ఆంక్షలు విధించారు. స్థానిక పెద్దమనుషుల మధ్య పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోవడంతో బాధిత యువతి కొల్లూరు పోలీసుల్ని ఆశ్రయించింది. భర్త, అతని తండ్రి, సోదరి, సోదరుడిపై ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రవీంద్రరెడ్డి పోక్సో కేసు నమోదు చేశారు.

చక్కని హాస్యానికి చిరునామా జంధ్యాల

అద్దంకి: చక్కని హాస్యానికి చిరునామా జంధ్యాల అనిసాహితీ స్రవంతి అధ్యక్షుడు చందలూరి నారాయణరావు పేర్కొన్నారు. పట్టణంలోని చిన్న శాంతయ్య పిచ్చమ్మ గార్ల సేవాసదన్‌లో శనివారం ప్రతిభామూర్తులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిభామూర్తుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సభకు ప్రముఖ రంగస్థల నటుడు ఆలకుంట శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఇటీవల మృతి చెందిన పత్రికాధిపతి రామోజీరావుకు సభ్యులు సంతాపం తెలియజేశారు. ఆయన ప్రతిభ గురించి చందలూరి నారాయణరావు ప్రసంగించారు. జంధ్యాల ఎన్నో హాస్య చిత్రాల్ని అందించి తెలుగు వారిని హాయిగా నవ్వించారన్నారు. ఉత్తమ విలువలు కలిగిన సినిమాలను తీసి తెలుగు గొప్పతానాన్ని చాటారని చెప్పారు. ఉత్తమ పాత్రలు ధరించిన తొలి తరం కథానాయికలలో జమున ఒకరని దాసరి లక్ష్మీరాజ్యం పేర్కొన్నారు. కార్యక్రమంలో మంగమూరి చిరంజీవి, అన్నమనేని వెంకట్రావు, సి.పి.హెచ్. కోటయ్య, ఆర్.వి.రాఘవరావు, ఎన్. నాగేశ్వరరావు,వి.వి బ్రహ్మం, సీహెచ్.రామాంజనేయులు, వై. వెంకటేశ్వర్లు, వి.రఘురామశర్మ సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.



జంధ్యాలకు నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

చిలకలూరిపేటటౌన్: రెండో వివాహం చేసుకున్న భార్య తన మొదటి భర్తతో సన్నిహితంగా ఉంటుందన్న అనుమానంతో హత్య చేసిన కేసులో భర్తను చిలకలూరిపేట రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం జరిగిన ఈ హత్య కేసు వివరాలను రూరల్ సీఐ పి శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు జి.రవికృష్ణ, వి.బాలకృష్ణ వెల్లడించారు. పట్టణంలోని టిడ్కో గృహ సముదాయాల్లో నివాసం ఉంటున్న మేడా సాయి భవానీకి ఐదేళ్ల కిందట పృథ్వీతో వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థల కారణంగా ఏడాది కిందట విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. అనంతరం ఆమె సురేష్‌ను వివాహం చేసుకుంది. ఈ నేపథ్యంలో సాయి భవానీ తన మొదటి భర్తతో తరచూ మాట్లాడుతూ, రహస్యంగా కలుస్తుందని భర్త సురేష్‌కు అనుమానం వచ్చింది. ఇందుకు భవానీ అక్క సహకారం అందిస్తున్నట్లు గ్రహించి భార్యను నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఆవేశంలో ఉన్న సురేష్ బైక్‌ను తెచ్చి మాట్లాడాలంటూ భార్య భవానీని ఎక్కించుకుని పోతవరం పొలాల్లోకి తీసుకెళ్లాడు. తర్వాత భవానీ శవమై కనిపించింది. భర్త సురేష్ గొంతునులిమి హత్య చేశాడంటూ ఆమె అక్క ఇచ్చిన ఫిర్యాదుతో రూరల్ ఎస్ఐ వి బాలకృష్ణ కేసు నమోదు చేశారు. డీఎస్పీ లక్ష్మీపతి నేతృత్వంలో రూరల్ పోలీసులు హత్య కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ రూరల్ సీఐ పి శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు జి రవికృష్ణ, వి బాలకృష్ణ, కానిస్టేబుల్స్ పి శ్రీకాంత్, ఎం ఇర్మియలను అభినందించారు.

కుంకుమ బండ్లతో గ్రామోత్సవం

కొనసాగుతున్న ముత్యాలమ్మ జాతర

తుమ్మకోట(రెంటచింతల): మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఇంద్రవెల్లి ముత్యాలమ్మ జాతర మహోత్సవంలో భాగంగా శనివారం కుంకుమ బండ్లతో గ్రామ పురవీధులలో గ్రామోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామ దేవతగా పూజలందుకుంటున్న ఇంద్రవెల్లి అమ్మవారికి పూర్వకాలం నుంచి రెండు సంవత్సరాలకు ఒకసారి ముత్యాలమ్మ జాతర కులమతాలకతీతంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు మొక్కులు చెల్లించుకుంటారు. లక్షల వ్యయంతో 33 కుంకుమ బండ్లు కట్టి వాటిని అందంగా అలంకరించారు. ఆచారంలో భాగంగా ముందు పెద్దకాపు, కరణం, పెద్దశెట్టి కుంకుమ బండ్లు, తరువాత వివిధ సమాజిక వర్గాలకు చెందిన మరో 30 బండ్లు గ్రామోత్సవంలో పాల్గొన్నాయి. పోతురాజు, మాతంగి కుంకుమ బండ్లకు ముందుండి దేవుని బజార్లలో తిరిగి అనంతరం ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నాయి. శనివారం ఉదయం 9 గంటల నుంచి కుంకుమ బండ్లతో గ్రామోత్సవం ప్రారంభించి రాత్రి 9 గంటల వరకు జాతర చేస్తూ ఆలయం వద్ద వరకు ఊరేగింపు కొనసాగించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా ముస్తాబు చేసి అలంకరించారు. జాతర ప్రశాంతంగా నిర్వహించడానికి ఎస్ఐ ఎం.ఆంజనేయులు తన సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.



గ్రామోత్సవం నిర్వహించి ఆలయం వద్దకు చేరుకుంటున్న కుంకుమ బండ్లు